ఘనంగా కృష్ణ 81వ జయంతి వేడుక

ప్రజాశక్తి-పీలేరు : సినిమా హీరో సూపర్ స్టార్ కృష్ణ 81వ జయంతిని పీలేరు ఆర్‌టిసి బస్టాండ్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన అభిమాన సంఘం నాయకులు కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ అభిమాన సంఘం అధ్యక్షులు పసుపులేటి వెంకటరమణ మాట్లాడుతూ సాంకేతికంగా తెలుగు చిత్ర రంగాన్ని హాలీవుడ్ స్థాయికి తీసుకెళ్ళిన ఘనత కృష్ణకే దక్కుతుందన్నారు. 350 చిత్రాలలో నటించారని గుర్తు చేశారు. సంఘ ఉపాధ్యక్షులు రామ్మూర్తి, కార్యదర్శి కె.సయీద్ సాహెబ్ మాట్లాడుతూ ఆయన భౌతికంగా మన మధ్య లేకున్నా ఆయన నటించిన చిత్రాల ద్వారా మన అందరి హృదయాల్లో ఉన్నారని పేర్కొన్నారు. అనంతరం ప్రయాణికులకు ఓఆర్‌ఎస్ పాకెట్లు, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎస్‌ఎండి షఫీ, పూల భాస్కర, విశ్రాంత ఉపాధ్యాయులు రామ్మూర్తి, షేక్ సాదిక్ బాష, మయూర్ నాథ్ శర్మ, కృష్ణ అభిమానులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

కృష్ణ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అభిమానులు

టిక్..టిక్..!

- ఎగ్జిట్‌పోల్ ఫలితాల కోసం నిరీక్షణ
- అభ్యర్థుల్లో పెరుగుతున్న హార్ట్‌బీట్
- తగ్గని బెట్టింగ్ రాయుళ్ల జోరు

ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల్లో హార్ట్‌బీట్ పెరిగిపోతోంది. కౌంటింగ్ తేదీ దగ్గర పడుతున్నకొద్దీ వేగంగా కొట్టుకుంటోంది. ఫలితంగా ఎన్నికల బరిలో నిలిచిన 230 మంది అభ్యర్థులు ఒత్తిడిని అధిగమించడం కోసం విహారం పేరిట దేశంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన తెలిసిందే. శనివారం సాయంత్రం దేశంలో ఏడవ దశ ఎన్నికలు ముగిసిన అనంతరం ఎగ్జిట్‌పోల్ ఫలితాలు వెలువడే అవకాశం కనిపిస్తోంది. బెట్టింగ్ పేరిట కోట్లాది రూపాయల పందేలు సాగించిన పందెంరాయుళ్లలోనూ ఎనలేని ఉత్కంఠ పెరిగిపోతోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో ఎక్కడ చూసినా ఎగ్జిట్‌పోల్ జపం నడుస్తోంది. సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల్లో ఉత్కంఠ రాజ్యమేలుతోంది. శనివారం సాయంత్రం దేశంలోని ఏడవ దశ పోలింగ్ ముగిసిన అనంతరం ఎగ్జిట్‌పోల్ ఫలితాలు వెలువడనున్నాయి. గడియారం ముళ్లు చేసే టిక్ ..టిక్ శబ్దం తరహాలో అభ్యర్థులు, బెట్టింగ్‌రాయుళ్లు, రాజకీయ పరిశీలకుల గుండెలు ప్రతిధ్వనిస్తున్నాయి. వైఎస్‌ఆర్ జిల్లాలో కడప పార్లమెంట్ స్థానం సహా కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్ ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలో రాజంపేట పార్లమెంట్ స్థానం సహా రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి అసెంబ్లీలు ఉన్నాయి. వీటి పరిధిలో 50 మంది పార్లమెంట్ అభ్యర్థులు, 180 మంది అసెంబ్లీ అభ్యర్థులు బరిలో నిలిచిన సంగతి తెలిసిందే. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల దగ్గర నుంచి నోటిఫికేషన్, ఎన్నికల ప్రచారం, స్క్రూటినీ, ఉపసంహరణ, పోలింగ్ అనంతరం కౌంటింగ్ దశకు చేరుకుంది. పోలింగ్ అనంతరం పార్లమెంట్, ఎమ్మెల్యే అభ్యర్థులకు కౌంటింగ్ దశ ఎనలేని ఉత్కంఠను కలిగిస్తోంది.

కౌంటింగ్ ఏజెంట్ల నియామకంపై దృష్టి అభ్యర్థులు సారించారు. కౌంటింగ్‌లో ఎటువంటి ఆటంకాలు, లోటుపాట్లను డేగకన్నుతో కనిపెట్టి, పరిష్కారానికి పట్టుబట్టాల్సి ఉంది. ఇటువంటి వ్యవహారాల్లో అత్యంత జాగరూకతతో వ్యవహరించాల్సి ఉంటుంది. సార్వత్రిక ఎన్నికలను పరిశీలిస్తే పోటాపోటీగా నడిచిన సంగతి తెలిసిందే. వైఎస్‌ఆర్ జిల్లాలో సుమారు 50 వేల, అన్నమయ్య జిల్లాలో సుమారు 26 వేల వరకు మహిళల ఓటింగ్ శాతం పెరుగుదలను మినహాయిస్తే నువ్వా నేనా అంటూ సాగిన ఎన్నికల క్రతువులో కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. క్లైమాక్స్ దశలో గట్టిగా పట్టుబట్టే సమర్థులైన అభర్థులను నిలబెట్టుకునే ప్రయత్నాల్లో నిలిచినట్లు తెలుస్తోంది. ఎన్నికల అధికార యంత్రాంగం కడప, అన్నమయ్య జిల్లాల్లో పకడ్బందీగా కౌంటింగ్ ఏర్పాట్లు చేస్తోంది.

కౌంటింగ్ దగ్గర పడే కొద్దీ ఉత్కంఠ పెరిగిపోతోంది. వైఎస్‌ఆర్, అన్నమయ్య జిల్లాలోని సుమారు నాలుగు వేలకుపైగా గ్రామాల్లో పందేలజోరు కొనసాగుతోంది.కడప, రాజంపేట పార్లమెంట్ స్థానాల పరిధిలోని 13 అసెంబ్లీ స్థానాల్లో బెట్టింగ్ బంగార్రాజుల చెలరేగిపో తున్నారు.రూ.లక్ష మొదలుకుని రూ.10 లక్షల వరకు పందేల జోరు కొనసాగుతోంది. రూ.లక్షకు, రూ.లక్షన్నర నుంచి రూ.మూడు లక్షల వరకు పందేలు సాగుతున్నాయి. పోలింగ్ నుంచి ఎగ్జిట్‌పోల్ వరకు సాగిన బెట్టింగ్ ప్రక్రియ ఒకతరహాలో సాగితే ఎగ్జిట్‌పోల్ నుంచి కౌంటింగ్ రోజు వరకు మరో తరహాలో బెట్టింగుల తీరు సాగే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలతో ఆగకుండా రాష్ట్రంలో ప్రభుత్వం అధికార వైసిపి, కూటముల్లో ఎవరిదనే అంశంపై పెద్ద ఎత్తున పందేలు జరుగుతుండడం సర్వత్రా ఉత్కంఠను కలిగిస్తోంది.

రౌడీషీటర్లపై పోలీస్ కొరడా?

ఉమ్మడి జిల్లాలో 1,638 మంది గుర్తింపు
27 మంది జిల్లా బహిష్కరణ
248 మంది గృహ నిర్బంధం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పోలీసులు కొరఢా ఝులిపించారు. జూన్ నాలుగున నిర్వహించనున్న కౌంటింగ్ అనంతరం హింస చోటుచేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు కనిపిస్తోంది. కడప జిల్లాలో 1,038 మంది రౌడీషీటర్లు, అన్నమయ్య జిల్లాలో 600 మంది రౌడీషీటర్లను గుర్తించింది. వీరిలో అనేకులను అదుపులోకి తీసుకోవడం, గృహనిర్బంధం చేయడం, హింసకు పాల్పడే అవకాశం ఉందని గుర్తించిన రౌడీషీటర్లను జిల్లా బహిష్కరణ వంటి గట్టి చర్యలు తీసుకుంది. కడప జిల్లాలో 1,038 మంది రౌడీషీటర్లలో 652 మందిని ముందస్తు అరెస్టు చేసింది. 131 మందిని గృహ నిర్భందం చేసింది. 21 మంది రౌడీషీటర్లను జిల్లా బహిష్కరణ చేసినట్లు తెలిసింది. అన్నమయ్య జిల్లాలో 600 మంది రౌడీషీటర్లను గుర్తించారు. వీరిలో 110 మందిని గృహ నిర్భందంలోకి తీసుకున్నారు. హింసకు అవకాశం ఉందని భావించిన ఆరుగురిని జిల్లా బహిష్కరణ చర్యలు చేపట్టినట్లు సమాచారం. దీనిపై అన్నమయ్య జిల్లా ఎస్పీని సంప్రదించగా ఐదు శాతం మందిని ఎక్స్‌టెన్షన్ చర్యలు తీసుకున్న మాట వాస్తవమేనని అంగీకరించారు. కడప జిల్లా ఎస్పీని ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

నియోజకవర్గాల వారీగా ఇవిఎంలను భద్రపరుస్తాం

- జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్

ఇవిఎం గోడౌన్‌ను పరిశీలించిన అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి రాయచోటి

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కౌంటింగ్ అనంతరం నియోజకవర్గం వారీగా అసెంబ్లీ, పార్లమెంట్ ఇవిఎంలను గోదాములో భద్రపరుస్తామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్ రాజకీయ పార్టీ ప్రతినిధులకు తెలిపారు. శుక్రవారం రాయచోటి మార్కెట్ యార్డ్ వద్ద ఉన్న ఇవిఎం గోడౌన్ వేర్ హౌస్‌ను మాసవారి తనిఖీలో భాగంగా వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి అభిషిక్త్ కిషోర్ సందర్శించి తనిఖీ చేశారు. గోదాం లోపల నియోజకవర్గ వారీగా ఏర్పాటు చేసిన పార్టీషన్‌ను, గోదాంలో ఉన్న డిఫెక్టివ్ ఇవిఎం, వివి ప్యాట్‌లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ తాజాగా జారీ చేసిన మార్గదర్శకాల మేరకు కౌంటింగ్ అనంతరం ఇవిఎంలను ఆయా నియోజకవర్గాల వారీగా విడివిడిగా గోదాంలో భద్రపరిచి, కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తామని రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు. అనంతరం వివిధ అంశాలలో తీసుకుంటున్న చర్యలను రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు. కార్యక్రమంలో ఇవిఎం జిల్లా నోడల్ అధికారి, డ్వామా పీడీ మద్దిలేటి, ఆర్‌అండ్‌బి అధికారి సహదేవరెడ్డి, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మసీదు, దర్గాలో 'గడికోట' ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

రాయచోటి పట్టణంలోని బంగ్లా సమీపంలోని మసీదులో జుమ్మా నమాజ్ ప్రార్థనలను, ఈద్గా సమీపంలో ఉన్న హజరత్ జమాలుల్లా బాషా దర్గాలో శుక్రవారం మైనారిటీ సోదరులతో కలసి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలుతో జీవించాలని, మత సామరస్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, మైనార్టీ జిల్లా అధ్యక్షులు బేపారి మహమ్మద్ ఖాన్, వైసిపి మైనార్టీ నాయకులు జాకీర్, కొలిమి చాన్‌బాష, రౌనక్, ఎస్‌పిఎస్ రిజ్వాన్, సాదక్ అలీ, పార్టీ పట్టణ అధ్యక్షులు రియాజుర్ రెహమాన్, రియాజ్, అన్నాసలీం, అల్తాఫ్, ఇర్షాద్, ఖలీమ్, అబుజర్, సాదిక్ అలీ, ఇందాద్, ఇంతియాజ్, అష్రఫ్, నవాజ్, ఫైరోజ్, ఖలీల్, ఇన్నాముల్లా, జమీవుల్లా, అజ్మతుల్లా ఖాన్, ఖదీర్ పాల్గొన్నారు.

దర్గాలో ప్రార్థనలు చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

'ఆదిత్య'లో రెండవ జాతీయ కాన్ఫరెన్స్

ప్రజాశక్తి-మదనపల్లి

స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, ఆర్, డి విభాగంలో శనివారం నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ కాంటెంపరరీ ఇష్యూస్ ఇన్ సైన్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ నిర్వహించినట్లు డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఆర్‌డిఒ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రాంప్రభు మాట్లాడుతూ కాన్ఫరెన్స్ యొక్క ప్రత్యేకత ప్రస్తుతం సైన్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఉన్న మార్పులు ఇంజనీరింగ్ విద్యార్థులు ఏ విధంగా ఉపయోగించుకోవాలో వివరంగా తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ సమకాలీన సమస్యలను పరిష్కరించడానికి శాస్త్ర ఇంజినీరింగ్, సాంకేతిక రంగాలలో పరిశోధనలు ఎంతో కీలకమని వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు వల్ల విద్యార్థులలో సైన్స్, ఇంజినీరింగ్ పట్ల నైపుణ్యంను కొత్త కొత్త ఆవిష్కరణలు చేయడానికి దోహదపడతాయని తెలిపారు. కన్వీనర్ డాక్టర్ పి.గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సుకు దేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన 108 రీసెర్చ్ పేపర్స్ ప్రదర్శించడానికి అవకాశం కల్పించారన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్.రామ్మోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ ఎం.నాగ మల్లారెడ్డి, కో-ఆర్డినేటర్స్ డాక్టర్ పి.అమర్నాథ్‌రెడ్డి, బి.సుబ్రహ్మణ్యం, విభాగ్యధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డైరెక్టర్ రామలింగారెడ్డి

కౌంటింగ్ కేంద్రంలో క్రమశిక్షణతో మెలగాలి

- జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి

కౌంటింగ్ కేంద్రంలో క్రమశిక్షణతో మెలగాలిని, సజావుగా ప్రశాంతంగా కౌంటింగ్ ప్రక్రియ జరిగి త్వరితగతిన ఫలితాలు వెల్లడి అయ్యేలా పూర్తిగా సహకరించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్ అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లకు తెలిపారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్ నందలి మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రాజంపేట పార్లమెంట్ అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లకు కౌంటింగ్ ప్రక్రియపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ నిమిత్తం చేస్తున్న ఏర్పాట్లు, కౌంటింగ్ హాల్స్ లేఅవుట్, కౌంటింగ్ ఏజెంట్ల అపాయింట్మెంట్ పద్ధతి, కౌంటింగ్ హాలులో పాటించాల్సిన నియమాలు, చెయ్యకూడని పనులు, ఇవిఎం, పోస్టల్ బ్యాలెట్, ఇటిపిబిఎస్ ఓట్ల లెక్కింపు విధానం, కౌంటింగ్ ఏజెంట్లుగా ఎవరిని నియమించాలి ఎంతమందిని నియమించవచ్చు, ఫుడ్ అరేంజ్మెంట్స్, వాహనాల పార్కింగ్, కమ్యూనికేషన్ హాల్, మీడియా ఫెసిలిటేషన్ సెంటర్, త్రీ లేయర్ సెక్యూరిటీ విధానం తదితర అంశాలలో తీసుకున్న చర్యలను అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లకు వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు, ఏజెంట్లు కౌంటింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు పూర్తిగా సహకరించాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియపై ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఆదేశాలు సూచనలను పక్కాగా పాటిస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రంలో అత్యంత పటిష్టంగా మూడు లేయర్ల బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. కౌంటింగ్ హాలులో క్రమశిక్షణతో ఉండాలని ఏవైనా సందేహాలు వస్తే వెంటనే రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకురావాలన్నారు. అనవసరమైన అల్లరి, సమస్యలు సృష్టిస్తే అలాంటి వారిని కౌంటింగ్ కేంద్రం నుంచి బయటికి పంపడమే కాకుండా హద్దు మీరి ప్రవర్తించిన వారిని అరెస్ట్ చేయవచ్చునని ఎన్నికల కమిషన్ స్పష్టంగా పేర్కొందని చెప్పారు. గెలుపు ఓటములు సహజంని వాటిని సమభావంతో తీసుకోవాలన్నారు. జూన్ 4న ఉదయం ఐదు గంటలకు సిబ్బంది 3వ దశ రాండమైజేషన్ చేసి కౌంటింగ్ టేబుల్స్ అలాట్ చేస్తారన్నారు. ఉదయం 6 గంటలకు స్ట్రాంగ్ రూములు తెరవడం జరుగుతుందని, ఎనిమిది గంటలకు పోస్టల్ బ్యాలెట్, 8:30 గంటలకు ఈవీఎంల ఓట్ల లెక్కింపు మొదలు పెట్టడం జరుగుతుందన్నారు. ఆరోజు ఉదయం 7 గంటల లోపు ఏజెంట్లు అందరూ కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎట్టి పరిస్థితులలో మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబడవని ఈ విషయాలను దృష్టిలో ఉంచుకోవాలని కోరారు. కౌంటింగ్ కేంద్రంలో గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు, రెండో అంతస్తులో ఏ నియోజకవర్గం ఎక్కడ ఏర్పాటు చేశారు, ఏజెంట్లు ఎవరికి ఎక్కడ రిపోర్ట్ చేయాలి, ఫుడ్ కోర్టు, వాహనాల పార్కింగ్, కమ్యూనికేషన్ రూమ్, మీడియా కేంద్రం తదితరాలన్నీ తెలిపేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు సిబ్బంది కూడా సహకారం అందిస్తారన్నారు. కౌంటింగ్ హాలు లోకి ప్రవేశించేందుకు అధికారులు, సిబ్బంది, ఏజెంట్లకు విడివిడిగా బారికేడింగ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అందరూ సహకరించి ఓట్ల లెక్కింపును విజయవంతం చేయాలని కోరారు. అంతకు ముందుగా కలెక్టర్ ఆదేశాల మేరకు రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కౌంటింగ్ ప్రక్రియ విధివిధానాలను అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లకు స్పష్టంగా వివరించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ సత్యనారాయణరావు, కలెక్టరేట్ ఎలక్షన్ సూపరింటెండెంట్ నరసింహారావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్

ఓట్ల లెక్కింపులో సూపర్ వైజర్ల పాత్ర కీలకం

మాక్ కౌంటింగ్ శిక్షణలో ఇవిఎం పరిశీలిస్తున్న లీలారాణి

ప్రజాశక్తి-రాయచోటి

ఓట్ల లెక్కింపు ప్రక్రియలో కౌంటింగ్ సూపర్ వైజర్లు పాత్ర కీలకమని రైల్వేకోడూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి లీలారాణి పేర్కొన్నారు.శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఓట్ల లెక్కింపుపై రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాల కౌంటింగ్ సిబ్బందికి (మాక్ కౌంటింగ్ శిక్షణ) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లీలారాణి మాట్లాడుతూ సాధారణ ఎన్నికల 2024 సంబంధించి అన్నమయ్య జిల్లాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహించేందుకు కౌంటింగ్ సిబ్బంది అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అధికారులు సిబ్బంది సమన్వయంతో ఓట్లు లెక్కింపు కేంద్రంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కౌంటింగ్ నిర్వహించాల్సి ఉంటుందని ఎవరు కూడా సొంత నిర్ణయాలు తీసుకొని పనిచేయరాదన్నారు. ఓట్లు లెక్కింపులో ఏదైనా అనుమానాలు ఉంటే ఇక్కడే డౌట్లు క్లియర్ చేసుకోవాలన్నారు. కౌంటింగ్ విధులకు కేటాయించిన సిబ్బంది అందరు జూన్ 4వ తేదీ ఉదయం 5 గంటలకు శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకోవలన్నారు. ఓట్లు లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో ఏ సమస్య వచ్చిన వెంటనే ఆర్‌ఒకు తెలియజేయాలన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఇవిఎంలలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే వెంటనే సంబంధిత బెల్ కంపెణి ఇంజినీర్లకు తెలియజేయాలన్నారు. ఇవిఎంలకు సంబంధించిన ఇంజనీర్లు అక్కడే అందుబాటులో ఉంటారాని వెంటనే వారికి తెలియజేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఆర్‌ఒలు, ఎన్నికల పరిశీలకులు మాత్రమే సెల్ ఫోన్స్ తీసుకెళ్ల వచ్చుని, మిగిలిన అధికారులు, సిబ్బంది ఎవ్వరు కూడా కౌంటింగ్ కేంద్రంలోని సెల్ ఫోన్లు తీసుకెళ్లరాదన్నారు. సెల్ ఫోన్‌ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌లో సెల్ ఫోన్లు ఉంచాలన్నారు. రాయచోటిలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కాలేజీలో జరిగే ఓట్ల లెక్కింపునకు సంబంధించి జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 12 కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఇవిఎంలు, పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి, ఫారం 13ఎ, 13బి,13 సి, 17సికి సంబంధించిన ఫామ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ కార్యక్రమాల నోడల్ అధికారులు డిపిఒ ధనలక్ష్మి, వెంకటేశ్వరరెడ్డి, కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదాయాభివృద్ధిలో మదనపల్లి-1 డిపో ఆదర్శం

- జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి రాము

ప్రజాశక్తి-పీలేరు

ప్రజా రవాణా సంస్థ ఆదాయాభివృద్ధిలో మదనపల్లి-1 డిపో జిల్లాకు ఆదర్శంగా ఉందని జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి రాము అన్నారు. శుక్రవారం ఆయన పీలేరు ఆర్టీసీ డిపో ఆకస్మిక తనిఖీ చేశారు. ఆర్టీసీ కార్గో పార్సిల్ కేంద్రాన్ని, బస్టాండ్ పరిసరాలను తనిఖీ చేశారు. వర్షాల సందర్భంగా బస్టాండులో ముంచెత్తుతున్న నీటి సమస్య గురించి డిపో మేనేజర్ బండ్ల కుమార్ ను అడిగి వివరాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కలిసిన మీడియాతో ఆయన మాట్లాడుతూ పాత బస్సుల స్థానంలో జిల్లాకు 56 కొత్త బస్సులు మంజూరయ్యాయని తెలిపారు. మరో 40 అద్దె బస్సులు కూడా ప్రజా రవాణా సంస్థ కేటాయించిందని చెప్పారు. పీలేరు ఆర్టీసీ డిపోకు కూడా తొమ్మిది ఎక్స్ప్రెస్ సర్వీసులు కేటాయించడం జరిగిందని తెలియజేశారు. ప్రస్తుతం ప్రజా రవాణా సంస్థకు ఆదాయం అందించడంలో, ఈపీకే, ఓఆర్ సాధనలోనూ అన్నమయ్య జిల్లా 12వ స్థానంలో ఉన్నట్లు చెప్పారు. అదేవిధంగా గ్రామీణ బస్సు సర్వీసుల ద్వారా అధిక ఆదాయం అందించడంలో పీలేరు ఆర్టీసీ డిపో అందరికీ ఆదర్శంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం డిపో కార్యాలయంలో జరిగిన కండక్టర్లు కె.నాగరాజ, ఇ.రెడ్డప్ప నాయుడు, ఎస్.మధుసూదన్ పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై, వారికి విలువైన సందేశం అందించారు. కార్యక్రమంలో పీలేరు డిపో మేనేజర్ బండ్ల కుమార్, ఆర్టీసీ సిఐ సుబ్బమ్మ, యూనియన్ నాయకులు లక్ష్మయ్య, చంద్ర, బాబు, రమణ, రాజు, ఎల్లయ్య, ఇతర నాయకులు, ప్రజా రవాణా సంస్థ ఉద్యోగులు, పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగుల కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్టాండ్ పరిసరాల్ని చూస్తున్న ఆర్‌ఎం రాము

ప్రథమ చికిత్సపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపల్ డి.స్వర్ణలత ఆధ్వర్యంలో శుక్రవారం ఫార్మసీ ప్రాక్టీస్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ సి.లీలామణిచే ప్రథమ చికిత్స అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో వక్తగా పాల్గొన్న లీలామణి ప్రథమ చికిత్స గురించి ఉద్దేశిస్తూ పలు సూచనలు చేశారు. కార్డియాక్ పల్మనరీ రెస్యూసైటేషన్, పాము కాటు, సీజర్స్, వడదెబ్బ, గాయాలు, ఫ్రాక్చర్స్, యాక్సిడెంట్ మొదలగు అనుకోకుండా వచ్చే జబ్బులకు ప్రథమ చికిత్సను ఎలా అందించాలో తెలిపారు. వడదెబ్బ సమయంలో వ్యక్తిని చల్లని ప్రదేశానికి తీసుకెళ్లి వారికి శరీరం పై తడిగుడ్డ నుంచి నీరు అందించాలని, అనుకోని యెడల పాము కాటు సంభవిస్తే ఆ ప్రదేశంలో రక్తం శరీరం అంతటా ప్రవహించకుండా ఆ భాగాన్ని కదిలించకుండా ఉంచాలని, నోటితో విషాన్ని తీసే ప్రయోగము లాంటివి చేయకూడదని తెలిపారు. ఫిట్స్ జబ్బుకు రోగికి వెంటనే తన చేతిలో ఇనుప వస్తువుతో తయారుచేసిన తాళాలు ఉంచకూడదని, మొదలగు నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో సి.చిన్ని కృష్ణయ్య, వినీల, హాసిని, శిరీష, అధ్యాపక బృందం, కళాశాల సహకార సిబ్బంది పాల్గొన్నారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ సి.గంగిరెడ్డి, వైస్ చైర్మన్ సి.ఎల్లారెడ్డి కోశాధికారి సి.అభిషేక్‌రెడ్డి, చైర్మన్ డాక్టర్ సి.రామచంద్రరెడ్డి సదస్సు నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు.

అవగాహన సదస్సులో పాల్గొన్న కళాశాల బృందం



రైతులకు వేరుశనగ విత్తన కాయలు అందిస్తున్న జెడి చంద్రనాయక్

రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-రామాపురం

రైతులకు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను రైతులు సద్వినియోగం చేసు కోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ పేర్కొన్నారు. మండలంలోని చిట్లూరు నల్లగుట్టపల్లి రైతు భరోసా కేంద్రాల్లో శుక్రవారం వేరుశన విత్తన కాయల పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీ చేశా రు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వేరుశనగ విత్తన కాయలు తీసుకున్న ప్రతి రైతు ఉపయోగించుకొని ఇ-పంట నమోదు చేయించా లన్నారు. ఇ-పంట నమోదు చేయించని వారి నుండి విత్తనకాయ ధర రికవరీ చేయబడుతుందని అన్నారు. ప్రభుత్వం నుంచి అందించే వాటికి అన ర్హులుగా గుర్తించడం జరుగుతుందన్నారు. విత్తనకాయల్లో నాణ్యత లేనియెడల రైతు భరోసా సిబ్బంది పరిశీలించి వెనుకకు పంపించాలని తెలిపారు. రైతుల నుండి ఎలాంటి ఫిర్యాదు లు రాకుండా చూసు కోవాలని, అధికారులు నిర్లక్ష్యం వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగమణి, మండల రైతు సలహా మండలి చైర్మన్ అయోధ్యరెడ్డి రైతులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 30 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి రైల్వేకోడూరు

పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 30 మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని కళాశాల ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్లేస్మెంట్ ఆఫీసర్ వెంకటప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో కెరీర్ స్కూల్, ఆసంచర్ అనే రెండు ఐటి, నాన్ ఐటి విభాగాలలో జాబ్ మేళా నిర్వహించగా మొత్తం 72 మంది విద్యార్థులు ఇంటర్వ్యూకు హాజరుకాగా అందులో 30 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

కుంటలో మట్టిని తోడుతున్న జెసిబి

యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా

- పట్టని రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలో అక్రమ మట్టి దందారాయుళ్ళు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కుంటలు, చెరువులు వదలకుండా వాటిని గుల్ల చేస్తున్నారు. బి.కొత్తకోట పెద్దచెరువులో అక్రమంగా వందల ట్రాక్టర్ల మట్టిని తోడేస్తూ పర్యావర ణానికి మట్టి మాఫియా ముప్పు తీసుకొస్తోంది. జెసిబిల సాయంతో మట్టిని తోడేస్తూ ఇళ్ల నిర్మాణాలకు, వెంచర్లకు తరలిస్తూ దళారులు జేబులు నింపుకుంటు న్నారు. గత కొద్దిరోజులుగా వందల ట్రాక్టర్ల మట్టిని తరలిస్తూ జేబులు నింపుకుం టున్న అక్రమార్కులపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఇసుక అక్రమ రవాణా, విచ్చలవిడిగా మట్టి త్రవ్వకాలు మండలంలో వెలుగు చూస్తున్నాయని, సత్వరమే అరికట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కోరుతున్నారు.

ప్రభుత్వ నిబంధనలు అమలు చేయాలి : ఎంఇఒ

ప్రజాశక్తి-కలికిరి

ప్రయివేట్ పాఠశాలలు కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలను అనుస రించి పనిచేయాలని ఎంఇఒ కరిముల్లా ప్రయివేట్ పాఠశాల యాజమాన్యలకు సూచించారు. శుక్రవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో ప్రవేటు పాఠశాల యాజమానులకు పాఠశాల విధివిధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తప్పనిసరిగా విద్యార్థులు ప్రభుత్వ టెక్స్టబుక్ లనే వాడాలని, పాఠశాలలలో అర్హత కలిగిన ఉపాధ్యాయులను నియమించాలని, ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు మాత్రమే వసూలు చేయాలని అన్నారు. ఆర్‌టిఇ చట్టం ఉచిత ప్రవేశాలు అనుమతించాలని, గుర్తింపు పునరుద్ధరణ సకాలంలో చేసుకోవాలని, ఎల్‌కెజి, యుకెజి అనుమతులు తీసుకోవడంపై విషయాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ 2, నాగార్జున, పాఠశాల యజమానులు పాల్గొన్నారు.

పెద్దమండ్యం: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రుచికరమైన నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని పెద్దమండ్యం ఎంఇఒ-2 జి.రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల మధ్యాహ్నభోజన నిర్వాహకులు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యంతో సమన్వయంతో ఉండాలని, మధ్యాహ్న భోజన మెనూ తప్పక అమలు పరచాలన్నారు. . దీన్ని దృష్టిలో ఉంచుకొని మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.వంటచేయు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోం దన్నారు. అనంతరం వంట పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహు మతులు ప్రదానం చేశారు. ప్రథమ బహు మతిగా అంగజాలవారిపల్లి ఎస్ రెడ్డమ్మ, రెండవ బహు మతి ఎస్.రేష్మ, మూడవ బహుమతి కె.సర స్వత మ్మల కు బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమంలో వంట ఏజెన్సీ నిర్వాహకులు, ఎంఇఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

అన్నమయ్య జిల్లా, మదనపల్లి టౌన్, క్రిష్ణానగర్, డోర్‌నెం.4-2ఎ నందు కాపురముండు పులివెందుల రామన్న కుమారుడైన పి.సుబ్రమణ్యం అను నా కక్షి కర్త తరపున ఇచ్చు బహిరంగ ప్రకటన ఏమనగా!

నా కక్షికర్త మరియు ముండ్ల శ్రీనివాసులు కలిసి షెడ్యూలు దాఖలాలో కనిన పూరా ఆస్థి అనగా వలసపల్లి గ్రామం సర్వేనెంబరు 497/బి5 నందు పూరా విస్తీర్ణం ఎ.1.55 సెంట్ల విస్తీర్ణము పైకి కుంట ఒకటికి రూ.2,11,000/- అక్షరాలా రెండు లక్షలా పదకొండువేల రూపాయలు ప్రకారం 27 కుంటలు పూరా విస్తీర్ణమునకు (67 1/2 సెంటు) రూ.56,97,000/- (యాభైఆరు లక్షల తొంభై ఏడువేల రూపాయలు)కు 29.02.2020వ తేదీన ధర ఏర్పాటు చేసుకొని హక్కుదారులైన దొంతి ఆంజనేయులు శెట్టి మరి యు దొంతి సుబ్రమణ్యం గుప్తాల నుండి విక్రయించుకొను నిమిత్తం రూ.30,00,000/- అక్షరాలా ముప్ఫైలక్షలు రూపాయలును అడ్వాన్సుగా చెల్లించి విక్రయ అగ్రిమెంటును రాయించుకొనిన తదుపరి సదరు దొంతి ఆంజనేయులు శెట్టి మరియు దొంతి సుబ్రమణ్యం గుప్తాలు అగ్రిమెంటు షరతుల ప్రకారం నడుచుకొనని కారణంగా నా కక్షికర్త సదరు షెడ్యూలు దాఖలా ఆస్థికి సంబంధించి మదనపల్లి రెండవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు నందు సదరు అగ్రిమెంటులో కనిన ఆస్థిని రిజిష్టరు చేయించుట నిమిత్తం ఓ.యస్.నెం.9/2024 అను దావాను వేసి యుండి షెడ్యూలు దాఖలా ఆస్థులపై ఎలాంటి పరాధీనములు కూడా జరుపరాదని పిటీషన్ కూడా దాఖలు చేయడం జరిగింది.

సదరు దావా మరియు పిటీషన్ పెండింగులో వున్న సమయంలో పై కనిన దొంతి ఆంజనేయులు శెట్టి మరియు దొంతి సుబ్రమణ్యం గుప్తా అనువార్లు షెడ్యూలు దాఖలా ఆస్థిని ఇతరులకు అమ్మజూపుటకు ప్రయత్నములు జరుగుతున్నవని నా కక్షిదారుకు తెలియవచ్చింది. సదరు షెడ్యూలు దాఖలా ఆస్థికి సంబంధించి ఎటువంటి క్రయ, విక్రయాలు కానీ రిజష్టరు పత్రాలు కానీ సృష్టించిన ఎడల చట్టరీత్యా అవి ఎంతమాత్రం చెల్లబోవనిన్నీ నా కక్షికర్త హక్కుభక్తుములను భంగపరచబోవనిన్నీ సదరు కొనుగోలుదారులకు ఎటువంటి హక్కు భుక్తములు సంక్రమించబోవనిన్నీ ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడమైనది.

షెడ్యూలు

అన్నమయ్య జిల్లా, మదనపల్లి మండలం, వలసపల్లి గ్రామ దాఖలా సర్వేనెంబరు 497/బి5 నందు పూరా విస్తీర్ణం ఎ.1.55 సెంట్ల విస్తీర్ణం పైకి ఎ.0.67 1/2 సెంట్ల సమిష్టి జమాను పూరా.

బి.వేణుగోపాల్, బి.కాం., ఎల్.ఎల్.బి.
వకీలు, మదనపల్లి.

రాజశ్రీ రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

RDA No. 01/2023
O.S.No. 01/2012

1. తాళ్ళపాక భానుమూర్తి, S/o క్రిష్ణమూర్తి
2. తాళ్ళపాక వెంకటసుబ్రమణ్యం, S/o క్రిష్ణమూర్తి, R/o వీరబల్లి టౌన్ మరియు మండలం, అన్నమయ్య జిల్లా.

...ప్రతివాదులు

Vs

షేక్ మస్తాన్‌వలీ, S/o ఖాదర్‌వలీ, వయస్సు 32 సం॥రాలు, ముస్లిం, బోస్‌నగర్, రాయచోటి టౌన్ మరియు మండలం, అన్నమయ్య జిల్లా.

...వాది

ప్రకటన

పై నెంబరు దావాలోని ప్రతివాదులు అయిన మేము డాక్యుమెంట్స్‌ను రిటర్న్ తీసుకొనుటకు గాను ఆర్‌డిఎ దాఖలు చేసియున్నాము. మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్నయెడల 28.06.2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు సదరు కోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనంతట మీ పరోక్షమున తీర్మాణించబడును అని ఇందుములమున ఖండితముగా తెలియజేయడమైనది.

యు.రామాంజనేయులు, బి.కాం.,ఎల్.ఎల్.బి.
జి.సి.ఎస్.రాయుడు, ఎం.సి.జె.ఎల్.ఎల్.బి.
ప్రతివాది తరపున వకీలు, రాయచోటి.

భగ్గుమంటున్న ఎండలు

- ఉక్కపోతతో జనం ఉక్కిరి బిక్కిరి
- వడదెబ్బకు గురవుతున్న వృద్ధులు
- నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు

ఉదయం 11 గంటలకే నిర్మానుష్యంగా మారిన వీధి

ప్రజాశక్తి-వీరబల్లి

రోహిణి కార్తె ఈనెల 25 నుంచి వచ్చింది. అప్పటినుంచి ఎండలు మండుతున్నాయి. భానుడి భగభగలకు తోడు వేడి గాలులు వీస్తుండటంతో ఉక్కపోతతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.అత్య వసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావడం లేదు. ఉదయం 8 గంటల నుంచి ఎండలు మండి పోతుండటంతో సాయంత్రం 6 గంటల తర్వాత బయటకు వస్తు న్నారు. ఎసిలు, కూలర్లు, వేసుకుంటేనే ఉండగలుగుతున్నారు. ఉదయం 8 గంటల నుంచి సూర్యప్రతాపంతో వాతావరణం త్వరగా వేడెక్కుతుంది. 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేడి గాలలకు జనం బయ టకు రావాలంటేనే జంకుతున్నారు. బయట తిరిగేవారు తరచుగా శీతల పానీయాలు తాగుతూసేద తీరుతున్నారు. బైక్ లో కొంత దూరం ప్రయా ణించగానే చెట్టు వస్తే కొంతసేపు ఆగుదామన్న ఆత్రుత వాహనదారుల్లో కనిపిస్తోంది. మండల ప్రధాన రహదారుల్లో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి నాలుగు గంటల వరకు జన సంచారం పెద్దగా ఉండడం లేదు.. మే నెల ప్రారంభంలో కొద్దిగా వర్షాలు పడి ఉపశమనం కలిగించినా మరల ఎండల తీవ్రత పెరడంతో వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు అవస్థలు పడుతున్నారు. విద్యుత్ సరఫరాకుఅంతరాయం కలిగితే తట్టుకోలేని పరిస్థితి నెలకొంది.

ఫ్యాన్లు తిరుగుతున్నా ఉక్కపోతే

రెండు రోజుల కిందట వడదెబ్బ తగిలింది. వాంతులు కావడం, కళ్ళు తిరగడంతో ఆసుపత్రిలో చేర్చారు. జ్వరం కూడా వచ్చింది. చికిత్స అనంతరం ప్రస్తుతం పరిస్థితి బాగానే ఉంది. ఎండ వేడిమికి తట్టుకోలేకపోతున్నా. ఫ్యాను తిరుగుతున్న ఉక్కపోత ఉంది.

-నాగరత్నమ్మ, వంగిమళ్ల

మండుతున్న ఎండలు

మండుటెండలు, వేడి గాలులు, ఉక్క పొత్తతో బయటకు పోలేక పోతున్నాను. ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. ఎండలో బయటకు పోతే వడదెబ్బ తగులుతుందని భయం. కూలి పనులకు పాలేకపోతున్నాం.

- వెంకటరమణ, వీరబల్లి

జాగ్రత్తలు తప్పనిసరి

ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి. తప్పనిసరిగా బయటకు వెళ్ళాల్సి వస్తే తలకు టోపీగానీ, రుమాలు గానీ చుట్టుకోవాలి. వదులుగా ఉండే తెల్లని వస్త్రాలు ధరించాలి. మజ్జిగ, కొబ్బరినీరు తరచుగా తీసుకోవాలి. కళ్ళు తిరగడం, వాంతులు రావడం, నీరసంగా ఉండడం,వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలి.

- డాక్టర్ జియా ఉల్లా, వీరబల్లి పిహెచ్‌సి.

పొగాకు ఆరోగ్యానికి హానికరం : ఆర్‌ఎంఒ

మదనపల్లి: ఆస్పత్రిలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

పజాశక్తి-మదనపల్లి

స్థానిక ప్రభుత్వ సర్వజన బోధన ఆస్పత్రిలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని ఆస్పత్రి ఆర్‌ఎంఒ డాక్టర్ ప్రసాద్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్.రాజు పాల్గొని మాట్లాడుతూ ప్రజలు పొగాకు వాడరాదన్నారు. పోగాకు వాడకం ఆరోగ్యానికి హానికరం అన్నారు. ప్రమాద కరమైన పొగాకును వాడకుండా ప్రజల్లో చైతన్యం తీసుకువద్దామని పిలుపునిచ్చారు. అనంతరం అస్పత్రి వైద్య సిబ్బందితో కలసి ప్రాంగణం నుండి పుర వీధుల్లో అవగాహనర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రాధిక, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బి.కొత్తకోట : పట్టణంలోని సామాజిక వైద్యశాలలో శుక్రవారం ఘనంగా అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్, డాక్టర్ హసీనా పర్వీన్ మాట్లాడుతూ పొగాకు జీవితానికి ఎంతో ప్రమాదకరమని అన్నారు. పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నష్టాలే అధికమని, పొగాకు శరీర అవయవాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందని అన్నారు. ఊపిరితిత్తులకు ముప్పు వాటిల్లి ఎంఫిసియా, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ ఫల్మనరీ డిసీజ్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకుతాయని అన్నారు. మెదడులో రక్త ప్రసరణకు అంతరాయం ఏర్పడడం, గొంతు కేన్సర్, గుండెపోటు వచ్చే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా పీల్చేవారికీ కూడా ప్రమాదమే అని ప్రతి ఒక్కరూ పొగాకు దూరంగా ఉండాలని మే 31వ తేదీన ప్రపంచవ్యాప్తంగా పొగాకు వ్యతిరేక దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు.

ప్రతి ఉద్యోగికీ విరమణ తప్పనిసరి

శంకరయ్య దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని నడిపిచర్ల పంచాయతీ నడిమిచెర్ల జడ్‌పి ఉన్నత పాఠశాలలో పంచాయతీ ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న శివరాత్రి శంకరయ్య శుక్రవారం పదవీవిరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది శంకరయ్యను పూలమాలలు,దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుల సంఘం మదనపల్లి డివిజన్ ప్రధాన కార్యదర్శి మోడెం చంగల్ రాయుడు పదవి విరమణ పొందిన శంకరయ్య దంపతులను సన్మానించి, ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని అన్నారు. ఉపాధ్యాయులుగా రావడం అదృష్టమని, ఉపాధ్యాయ వృత్తిని అంకితభావంతో నిర్వహించినవారు చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. శంకరయ్య వృత్తిపట్ల నిబద్ధతతో పనిచేసి ఎంతో మంది విద్యార్థులను సమాజానికి ఆదర్శవంతమైన యువతగా తీర్చిదిద్దారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నరసింహారెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ప్రధానోపా ధ్యాయులు శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయులు పుష్పావతి, రెడ్డి శేఖర్, ప్రసాద్, రామయ్య, అనిత, వైవి రమణ పాల్గొన్నారు.

ఎంపిడిఒకు సన్మానం

రామసముద్రం : రామసముద్రం మండల అభివృద్ధి అధికారిగా పనిచేసిన ఎల్.నారాయణ స్వామి పదవీవిరమణ సందర్భంగా మండల అభివృద్ధి కార్యాలయం ప్రాంగణంలో కార్యాలయ సిబ్బంది సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు మాట్లాడుతూ 36 సంవత్సరాలుగా ఎంతో నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వహించి పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా ఎంపిడిఒకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సిబ్బంది, పంచాయతీల కార్యదర్శిలు ఎంపిడిఒ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ నారాయణస్వామిని సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

శేషాద్రి హత్య కేసులో ఏడుగురు అరెస్టు : డిఎస్‌పి

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి

అరెస్టయిన నిందితులు, స్వాధీనం చేసుకున్న మారణాయుధాలు

ప్రజాశక్తి-మదనపల్లి

జిల్లాలో సంచలనం రేకెత్తించిన శేషాద్రి హత్య కేసులో ఏడుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న మదనపల్లె అనపగుట్ట శ్రీవారినగర్ లో జిల్లాలో సంచలనం రేకెత్తించిన రామారావు కాలనీకి చెందిన పుంగనూరు శేషాద్రి అలియాస్ శేషు(32) ను గొల్లపల్లెకు చెందిన ఆనంద్, రాజశేఖర్, చరణ్, చెన్నారెడ్డి, మణికంఠ, మహేశ్, నజీర్‌ఖాన్ ఈ హత్య చేసినట్లు తెలిపారు. కుల సంఘాల నేతల మధ్య భూ కబ్జాలు, భూదందాలు, సెటిల్‌మెంట్లు విచ్చలవిడిగ దాడులకు పాల్పడడం, కొట్టడం కులాన్ని, సంఘాలను అడ్డం పెట్టుకుని వేధింపులకు గురి చేయడం, అట్రాసిటీ కేసులు పెట్టడం వంటివి చేస్తూ ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్న కొందరిలో రెండు వర్గాల మధ్య ఆధిపత్యపోరు తారస్థాయికి చేరిందని అన్నారు. ఈ క్రమంలోనే పుంగనూరు శేషాద్రిని ప్రత్యర్థులు ఈనెల 25న అతి దారుణంగా కత్తులు, కొడవళ్లతో హత్య చేశారని అన్నారు. ఈ కేసును ఛేదించేందుకు మూడు టీమ్‌లుగా టూటౌన్ సిఐ యువరాజు, వన్ టౌన్ సిఐ వల్లిబాషా, తాలూకా సిఐ శేఖర్, రూరల్ సర్కిల్ సిఐ సద్గురుడు, ఎస్ఐ వెంకటసుబ్బయ్య కేసును దర్యాప్తు చేపట్టి రాబడిన పక్కా సమాచారంతో నిందితులను అరెస్టు చేసి ఇన్నోవా వాహనం, బైకులు, ఆటోలను సీజ్ చేసినట్లు చెప్పారు. భూ కబ్జాలు, దందాలు, సెటిల్మెంట్లు తార స్థాయికి చేరి వర్గ విభేదాలతో ఈ హత్య జరిగినట్లు తెలిపారు. ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసిన రిమాండ్‌కు తరలించామని డిఎస్‌పి తెలిపారు.

పశు వైద్యుల నిర్లక్ష్యంతో పాడి ఆవు మృతి

ప్రజాశక్తి - రామసముద్రం

పశు వైద్యులు నిర్లక్ష్యం కారణంగా ఓ కుటుంబం వీధిన పడింది. వివరాల్లోకి వెళితే... మండలంలోని ఊలపాడు పంచాయతీ బుసాని కురప్పల్లి గ్రామానికి చెందిన ముత్తన్నగారి మునిరత్న అనే పాడి రైతుకు చెందిన పాడి పశువుకు నాలుగు రోజులు క్రితం ఆరోగ్యం క్షీణినించింది. అనంతరం సంచార పశు ఆరోగ్య సేవకు సమాచారం అందించారు. సంచార సేవ వైద్యులు సరైన చికిత్స అందించలేదని వారి నిర్లక్ష్యం కారణంగా పాడి ఆవును కోల్పోయానని కన్నీరుమున్నీరుగా విలపించారు. పశువుల మేత, నీరు తీసుకోలేక రోధిస్తున్న ఆవుకు జబ్బు నయం చేయడానికి స్థానిక పశు వైద్యులను సంప్రదించారు. నయం కాకపోవడంతో పాడి పశువు మృతి చెందింది. బాధితుడు మాట్లాడుతూ పాడి పశువులే జీవనాధారంగా జీవిస్తున్న తమను వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వీధిన పడ్డామని వాపోయారు. ఈ విషయం పై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

పింఛన్ కోసం వేచివున్న వృద్ధులు (ఫైల్ ఫొటో)

పింఛన్ పాట్లు మళ్లీ తప్పవా?

- ఆందోళన చెందుతున్న వృద్ధులు

ప్రజాశక్తి-వీరబల్లి

సామాజిక భద్రత పింఛన్ పంపిణీ వ్యవహారంలో లబ్ధిదారులను గత రెండు నెలలుగా ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తూనే ఉంది. పింఛన్ సొమ్ము అందించడంలో ఉన్నత అధికారుల తీరు జగన్నాటకం గానే కనిపిస్తుంది. గత రెండు నెలలుగా పింఛన్ కోసం తిరిగి ఇబ్బందులకు గురైన వృద్ధులు జూన్ నెలకు సంబంధించిన పింఛన్‌ను బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుండటంతో మళ్లీ అగచాట్లు తప్పేలా లేవని వృద్ధులు ఆందోళన చెందుతున్నారు. ఇంటింటికి వెళ్లి సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్ సొమ్ము ఇచ్చే అవకాశం ఉన్నా, ఆ దిశగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదని పింఛన్‌దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ నెలలో గ్రామ, వార్డు సచివాలయాలకు రప్పించి ప్రభుత్వం లబ్ధిదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. పెద్ద ఎత్తున ఆందోళన రావడంతో మే నెలలో పింఛను సొమ్మును బ్యాంకు ఖాతాలో జమ చేసి చేతులు దులిపేసుకుందన్నారు. బ్యాంకు ఖాతాలపై అవగాహన లేనివారు, సరిగా సంతకాలు, వేలిముద్రలు పడనివారు, ఖాతాలు నిర్వహించని వారు, పింఛను సొమ్ము కోసం బ్యాంకుల వద్ద చాలా అవస్థలు పడాల్సి వస్తోందని ఆందోళన చెందుతుందన్నారు.

ఘర్షణలు చోటు చేసుకుంటే మీరే బాధ్యులు : ఎస్‌పి

ప్రజాశక్తి-కలకడ

కౌంటింగ్ రోజున మండలంలో ఘర్షణలు చోటు చేసుకుంటే మీరే బాధ్యులు అవుతారని అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు హెచ్చరించారు మండల కేంద్రమైన కలకడ పోలీస్ స్టేషన్ ను శుక్రవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4న జరుగు కౌంటింగ్ రోజు మండలంలో ఘర్షణలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండలంలో సమస్యాత్మకంగా ఉన్న గ్రామాలలో గస్తీని మమ్మలను చేస్తే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఘర్షణలు చోటు చేసుకోకుండా తగు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ రామకృష్ణారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కలికిరి

వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేష్ తెలిపారు. ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి గను 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిప్లమో ఇన్ అగ్రికల్చర్, డిప్లమో ఇన్ షీడ్ టెక్నాలజీ, డిప్లమా ఇన్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కోర్సులకు సంబంధించి రెండు, మూడు సంవత్సరాల కోర్సు లకు నోటిఫికేషన్ విడుదల చేసారని, పదవ తరగతి పాసై అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జూన్ 1వ తేది నుండి 20వ తేదీ లోపల ఎఎన్‌జిఎఆర్‌యు.ఎన్‌సి.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఆన్లైన్ రిజిస్ట్రేషన్ వివరాలు కొరకు 8008104977 సంప్రదించాలని కోరారు.

విభిన్న ప్రతిభావంతుల 'భవిత'కు భరోసా

ప్రజాశక్తి-పీలేరు

విభిన్నప్రతిభావంతుల భవిష్యత్తుకు భవిత కేంద్రాలు భరోసా ఇస్తున్నాయని కె.వి పల్లి మండల విద్యాశాఖ అధికారులు పి.రెడ్డిబాషా, డి.సుబ్రహ్మణ్యంరెడ్డి తెలిపారు. డిఇఒ శివప్రకాష్‌రెడ్డి, ఐఇ సమన్వయకర్త జనార్ధన్ ఆదేశాల మేరకు ప్రత్యేక అవసరాలున్న పిల్లలు ఇంటికే పరిమితం కాకుండా, వారిలో మానసిక, శారీరక అభివృద్ధిని తీసుకురావాలన్న ఉద్దేశ్యంతో కెవి పల్లి మండలంలో ఐఇఆర్‌టిఎ మాధవి, జె.నేతాజీల ద్వారా ఇంటింటి సర్వే చేపట్టామన్నారు. ప్రతి ఒక్క విభిన్న ప్రతిభావంత పిల్లల పేర్లను బడిలో నమోదు చేయిస్తే చదువుకు దూరంగా ఉన్న దివ్యాంగ పిల్లలు బడిలో చేరాక ప్రభుత్వం తరపున వచ్చే సంక్షేమ పథకాల రాయితీలు, సదుపాయాలు, అమలవుతున్న విద్యా శిక్షణలు తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమం మే ఒకటి నుంచి జూన్ 9 వరకు జరుగుతుందని అన్నారు. ఇందులో భాగంగా ప్రతి తల్లిదండ్రులు మండలంలోని దివ్యాంగ పిల్లల గురించిన సమాచారం ఐఇఆర్‌టి సిబ్బందికి తెలియజేసి ప్రతి ఒక్క దివ్యాంగ బాల, బాలికులు కూడా విద్యను అభ్యసించేందుకు సహకరించాలని కోరారు. **నందలూరు :** ప్రతి విభిన్న ప్రతిభావంత పిల్లవాడిని ఇంటికి పరిమితం కాకుండా వారిలో మానసిక ,శారీరకంగా అభివృద్ధి చెందాలన్నా ఉద్దేశంతో పాఠశాలల్లో చేర్పించేందుకు ఇంటింటా సర్వే నిర్వహించడం జరుగుతుందని మండల సమ్మిళిత ఉపాధ్యాయులు రంగస్వామి తెలిపారు. శుక్రవారం విభిన్న ప్రతిభావంత పిల్లల గుర్తింపు కోసం ఆడపూర్‌లో ఇంటింటా సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్ రెడ్డి, సమ్మిళిత విద్య సమన్వయకర్త జనార్ధన్ ఆదేశాల మేరకు సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటివరకు 15 మంది బడిలో లేని విభిన్న ప్రతిభావంత పిల్లలను గుర్తించామని చెప్పారు. భవిత కేంద్రాల వల్ల దివ్యాంగ పిల్లలకు ఉపకరణాలు, ఉపకార వేతనాలు, చిన్నపాటి శస్త్ర చికిత్సలు, రవాణా బత్యం, ఎస్కార్ట్ అలవెన్సు కింద రూ.300లు, బాలికలకు ప్రత్యేకంగా రూ.200లు, వినికిడి, దృష్టిలోపం ఉన్న పిల్లలకు ట్యాబులు, స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ శిక్షణ ఇలాంటి సదుపాయాలన్నీ భవిత కేంద్రాల్లో లభ్యమవుతాయని తల్లిదండ్రులకు వివరించి పాఠశాలల్లో చేర్పిస్తామని తెలిపారు.

నేటి నుంచి పాలేటమ్మ జాతర

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలంలోని కలిబండ గ్రామంలో శనివారం రాత్రికి నిండు తిరుణాల, ఆదివారం మైల తిరుణాల జరుగుతుందని ఆలయ నిర్వహకులు తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి రాత్రికి అమ్మ వారికి చాందిని బండ్లు కట్టి, బోనాలు సమర్పిస్తారని చెప్పారు. భక్తులు తమ మొక్కు తీర్చుకుంటారని గ్రామ ప్రజలు తెలిపారు.

ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా భానుప్రసాద్

ప్రజాశక్తి-రామసముద్రం: రామసముద్రం మండల ఇంచార్జ్ ఎంపిడిఒగా భానుప్రసాద్ బాధ్యతలు స్వీకరించనున్నట్లు సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపిడిఒ ఎల్. నారాయణస్వామి శుక్రవారం పదవీ విరమణ చేపట్టడంతో శనివారం మదనపల్లి ఎంపిడిఒ భానుప్రసాద్ ఇన్‌ఛార్జి ఎంపిగొగా బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

ఇసుక టిప్పర్ స్వాధీనం

ప్రజాశక్తి-గాలివీడు

పోలీసులు సీజ్ చేసిన ఇసుక టిప్పర్

లక్కిరెడ్డి పల్లి ఎస్ఇబి సిఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం గరువుపల్లి క్రాస్ వద్ద వేంపల్లి నుంచి గుర్రం కొండకు అక్రమ తరలు తున్న ఇసుక టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇసుక రవాణాకు సంబంధించి ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో టిప్పర్‌ను స్వాధీనంచేసుకొని డ్రైవర్ షేక్ బాబాజీని గాలివీడు పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. ఇసుక అక్రమ రవాణాపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఈ దాడుల్లో హెడ్ కాని స్టేబుల్ మోహన్‌రెడ్డి , నాగరాజు, నాగేంద్ర పాల్గొన్నట్లు తెలిపారు.